
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 22 ఆగస్టు 2024



భద్రకు ఆప్ నేతల వాయనం


బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లా తరికెరె తాలూకాలో ఆరేళ్ల అనంతరం తొలిసారిగా భర్తీ అయిన భద్ర ఆనకట్టకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)నాయకులు బుధవారం వాయనం సమర్పించారు. ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు జలాశయం వద్ద విశేషపూజల అనంతరం సంప్రదాయంగా వాయనం సమర్పించారు. కార్యక్రమంలో సాణేహళ్లి పండితారాధ్య శివాచార్య మహాస్వామి, ఆప్ జిల్లా అధ్యక్షుడు రుద్రారాధ్య, డాక్టర్ సుందర గౌడ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ కనుమలపై డోలాయమానం



సంరక్షణ కోసం కస్తూరిరంగన్ పలు సూచనలు
ప్రజల నుంచి ప్రతిఘటన ఎదురవుతుందని ఆందోళన
చర్యలపై ప్రభుత్వం వెనుకడుగు
నేడు మంత్రివర్గంలో కీలక చర్చ

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లాల పరిధిలో విస్తారంగా వ్యాపించిన పశ్చిమ కనుమల వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం డోలాయమానంలో పడింది. పశ్చిమ కనుమలకు అనుబంధంగా ఉండే పట్టణాలు, పల్లెల్లో దశాబ్దాల కాలంగా అటవీప్రాంతాల ఆక్రమణ సాగింది. వేలాది కుటుంబాలు తరతరాలుగా పంటలసాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. పశ్చిమ కనుమల సంరక్షణతోపాటు పలు అంశాలపై కస్తూరిరంగన్ నేతృత్వంలో కమిటీ విస్తృతంగా పరిశీలించి నివేదిక సమర్పించింది. కస్తూరిరంగన్ నివేదికను ప్రభుత్వం వ్యతిరేకిస్తూ వస్తోంది. నివేదికలో పశ్చిమ కనుమలకు అనుబంధమైన ప్రాంతాలను సూక్ష్మ ప్రదేశాలుగా గుర్తించాలని స్పష్టం చేసింది. ఇలా అమలు చేస్తే వేలాది మంది భవితవ్యం ప్రశ్నార్థకం కానుంది. పశ్చిమ కనుమలలో ఆక్రమణలు తొలగించాలని, సూక్ష్మ ప్రదేశంగా గుర్తించిన ప్రాంతాల్లో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, బోరుబావులు తవ్వరాదని సూచించింది. ఇప్పటికే పశ్చిమ కనుమలకు అనుబంధంగా నివాసాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నివేదికను అమలు చేస్తే పెద్ద ఎత్తున ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం వెనుకడుగు వేస్తూ వచ్చింది. దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలనే ప్రయత్నాలు సాగాయి. 2013 నుంచి 2018లో అప్పటి సీఎం సిద్దరామయ్య పాలనలో రెవెన్యూ శాఖ మంత్రిగా వ్యవహరించిన కాగోడు తిమ్మప్ప హక్కు పత్రాలు ఇచ్చేందుకు తీవ్రంగానే ప్రయత్నించారు. ఆయన కొన్నాళ్ల తర్వాత మంత్రి పదవికి దూరం కావడంతో అది పెండింగ్‌లో పడింది. రాష్ట్రంలో పశ్చిమ కనుమలు కల్గిన జిల్లాల పరిధిలో ఇటీవల భూమి కుంచించుకుపోవడం, కొండ చరియలు విరిగిపడ్డం వంటి సంఘటనలు కొనసాగుతున్నాయి. ఉత్తర కన్నడ జిల్లా శిరసి తాలూకాలో భూమి కుంచించిన విషయం తెలిసిందే. కొడగు, హాసన్, చిక్కమగళూరు జిల్లాల్లో నిరంతరంగా కొండ చరియలు విరిగిపడుతున్నాయి. రాష్ట్రంలో శిరసి తాలూకాలో భారీ ప్రమాదం జరిగింది. కాగా, కేరళ రాష్ట్రం వయనాడ్‌లో చోటు చేసుకున్న ప్రకృతి వైపరీత్యం అంతర్జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో దక్షిణకన్నడ, ఉత్తరకన్నడ, చిక్కమగళూరు, ఉడుపి, శివమొగ్గ, చామరాజనగర, బెళగావితోపాటు వివిధ జిల్లాల్లో కలిపి 44,448 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పశ్చిమ కనుమలు విస్తరించి ఉండగా 20,668 చదరపు కిలోమీటర్ల ప్రదేశం కస్తూరి రంగన్ నివేదికలో సూక్ష్మ ప్రదేశంగా గుర్తించారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న 1553 పల్లెల జీవన విధానంపై తీవ్రమైన సమస్య కానుంది.



నిర్ణయంలో మార్పు ఎందుకో..?

జనావాస కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అడ్డుగా ఉన్న నివేదికను అంగీకరించడం సాధ్యం కాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల ద్వారా తీవ్రమైన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర ఆర్డినెన్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్పష్టం చేసేందుకు అటవీశాఖ ఒక నివేదిక సిద్ధం చేసింది. పశ్చిమకనుమల శ్రేణిలో 1,64,280 చదరపు కిలోమీటర్లపైకి 59,940 చదరపు కిలోమీటర్లు సూక్ష్మ ప్రదేశంగా కస్తూరిరంగన్ నివేదికలో గుర్తించారు. సదరు నివేదికను అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. వీటికి సంబంధించి పలు రాష్ట్రాలు అంగీకరించనందున ఆరోసారి కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ విడుదల చేసింది. రాష్ట్రంలో సుమారు 16వేల చదరపు కిలోమీటర్ల ప్రదేశంలో జాతీయ వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతంలో జనావాసాలు ఉన్నందున వీటిని అమలు చేయడం కష్టంగా ఉంది. ఆదివాసీలతోపాటు తరతరాలుగా నివసిస్తున్న ప్రజలు అడవుల అంచున ఉన్నారు. వారి రక్షణ ముఖ్యమనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను అంగీకరించలేదు. సూక్ష్మప్రదేశాలలో గనుల తవ్వకాలు, ఇసుక సేకరణ, జల విద్యుత్, పవన విద్యుత్ ప్రాజెక్టులు వంటివి చేపట్టరాదు. ఐదేళ్లలోపు పరిశ్రమలను మూసివేయాలి. సిమెంటు, రాళ్లు, రసాయనాలు ఉపయోగించరాదు. జనావాస కేంద్రాలలో నిర్మాణాలకు నిషేధం అన్వయించాల్సి ఉంటుంది. మానవాళి ఆక్రమణలు పూర్తిగా నిలుపుదల చేయాల్సి ఉంటుంది. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమని భావించి నిర్ణయాన్ని మార్చుకున్నట్టు తెలుస్తోంది.

నేడు కేబినెట్ మీట్

కొన్నేళ్ల కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కస్తూరిరంగన్ నివేదికను వ్యతిరేకిస్తూ వచ్చింది. కానీ కేరళలో జరిగిన ఘోర ప్రమాదం నేపథ్యంలో నివేదికను అమలు చేయలేమని పట్టుబట్టితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వెనుకడుగు వేస్తోంది. వయనాడ్‌లో ఏకంగా ఊళ్లకుఊళ్లు కొట్టుకుపోయాయి. వీటన్నింటి నేపథ్యంలో గురువారం నిర్వహించనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చిస్తారని తెలుస్తోంది. ఈ విషయంలో మంత్రివర్గం తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.



గజరాజులకు ఘన స్వాగతం

మైసూరు దసరా సంబరాలకు తరలివచ్చిన 9 ఏనుగులు
స్వాగతం పలికిన మంత్రులు, జిల్లా అధికారులు



ఏనుగులకు స్వాగతం పలుకుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): హుణసూరు తాలూకా వీరనహోసహళ్లి వద్ద మైసూరు దసరా సంబరాలలో పాల్గొనే గజరాజులకు ఘనంగా స్వాగతం పలికారు. మైసూరు దసరా వేడుకల్లో పాల్గొనే 9 ఏనుగులకు మంత్రులు మహదేవప్ప, ఈశ్వర్‌ఖండ్రె, వెంకటేశ్ సంప్రదాయంగా పూజలు నిర్వహించి అటవీ ప్రాంతం నుంచి బయల్దేరే ప్రక్రియకు బుధవారం శ్రీకారం చుట్టారు. తొలి విడతలో 9 ఏనుగులు బయల్దేరాయి. రెండో విడతలో మరో ఐదు ఏనుగులు మైసూరుకు రానున్నాయి. ఈనెల 23న ఏనుగులు మైసూరు ప్యాలెస్‌కు చేరుకోనున్నాయి. అభిమన్యు (58), భీమ (24), గోపి (41), ధనంజయ (43), కంజన్ (25), రోహిణి (22), లక్ష్మి (53), వరలక్ష్మి (67), ఏకలవ్య (38) ఏనుగులు బయల్దేరాయి. వీటిలో 7 మగ, 2 ఆడ ఏనుగులు ఉన్నాయి. ఈ ఏడాది 58 ఏళ్ల అభిమన్యు నాడదేవత చాముండేశ్వరి దేవి బంగారు అంబారిని మోయనుంది. ప్యాలెస్ పురోహితుడు ప్రహ్లాదరావ్ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఏనుగులకు పంచఫల, కుడుములు, బెల్లం, చెరుకులతో తయారు చేసిన ఆహారపదార్థాలు అందించారు. గణపతి అర్చన, వనదేవత, చాముండేశ్వరి దేవతలకు పూజలు చేశారు. కంసాలె, పూజా కుణిత, తమటె, చండమేళా, నాదస్వర, డొళ్లుకుణిత కళాబృందాలు పాల్గొన్నాయి. ఎమ్మెల్యేలు హరీశ్‌గౌడ, అనిల్ చిక్కమాదు, ఎంపీ సునిల్‌బోస్, ఐజీపీ బోరలింగయ్య, జిల్లా అధికారి లక్ష్మీకాంతరెడ్డి, ఎస్పీ విష్ణువర్ధన్, అటవీశాఖ సంరక్షణాధికారి కుమార పుష్కర్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆల్మట్టి పెంపునకు కేంద్రం సహకరించాలి

ముఖ్యమంత్రి సిద్దరామయ్య
వాయనం సమర్పించిన సీఎం, డీసీఎం

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణ ట్రిబ్యునల్ తీర్పునకు అనుగుణంగా రాష్ట్రానికి 130 టీఎంసీల అదనపు నీరు లభించనుందని, ఇందుకోసం ఆల్మట్టి జలాశయాన్ని పెంచేందుకు గెజిట్ జారీ చేసేలా కేంద్రం సహకరించాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కోరారు. ఉత్తర కర్ణాటకలో కృష్ణ నదిపై నిర్మించిన ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయిలో నిండడంతో బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గంగపూజ చేసి వాయనం సమర్పించారు. ఆల్మట్టి జలాశయంలో గంగపూజ అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ ఆల్మట్టి జలాశయం ప్రస్తుతం 519.60 మీటర్ల ఎత్తు ఉందని, దీనిని 524.25 మీటర్లకు పెంచాల్సి ఉందన్నారు. కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వనందున పనులు చేయడం సాధ్యం కాలేదన్నారు. ఇందుకోసం కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కృష్ణ ట్రిబ్యునల్-2 ప్రకారం కేంద్రప్రభుత్వం గెజిట్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తాను, డీసీఎం ప్రధానమంత్రితోపాటు కేంద్రమంత్రులను కలసి వినతులు ఇచ్చామని అన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి పునరావాసం కల్పించేందుకు కట్టుబడ్డామన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుకు రూ. 51,148 కోట్ల అంచనాలకు ఆమోదం లభించిందని, ప్రస్తుతం ఈ మొత్తం రూ. 80వేల కోట్లు కావచ్చు అన్నారు. ఏటా తమ ప్రభుత్వం రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయాలని ఉద్దేశించామన్నారు. వీటన్నింటికంటే ముందు కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ రావాల్సి ఉన్నందున ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులలో పూడిక నిండిపోతుండడంతో ఇక్కడ ప్రత్యామ్నాయ జలాశయం నిర్మాణం ప్రస్తావన ఉందా అనే మీడియా ప్రశ్నకు సమాధానంగా ప్రాజెక్టుల్లో పూడిక ప్రమాణం, నీటి సామర్థ్యం వంటి అంశాలపై చర్చలు జరుపుతామన్నారు. రైతుల అనుకూలం కోసం బసవసాగర్‌తోపాటు ఇతర ప్రాజెక్టులకు నీటి పంపిణీ ప్రక్రియ ఇవ్వదలిచామన్నారు. తుంగభద్ర ప్రాజెక్టులో 19వ క్రస్ట్‌గేట్ అమరిక మూడు నాలుగు రోజుల్లోనే ముగిసిందన్నారు. ప్రాజెక్టులో ఇప్పటికి 78 టీఎంసీల నీరు నిల్వ ఉందని, మరో 20 టీఎంసీల నీరు చేరితే 95 శాతం భర్తీ కానుందన్నారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రైతులకు తొలిపంటకు నీరు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఎంబీ పాటిల్, ఆర్‌బీ తిమ్మాపుర, శివానందపాటిల్, ఎమ్మెల్యేలు, అధికారులు భాగస్వామ్యులయ్యారు.



గంగపూజ చేస్తూ...



వాయనం సమర్పిస్తున్న సిద్దరామయ్య, డీకే శివకుమార్ తదితరులు

సర్కారు బడుల్లో తగ్గిన అడ్మిషన్లు

10లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 4,398
30లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 18వేలు



బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతోంది. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతుండడంతో ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోయే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 46 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 18వేల పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఫీజుల భారం మోయడం కష్టమైనా మంచి విద్య అందిస్తే చాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య సాధ్యం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాజంలో ఏ సమస్య వచ్చినా ప్రభుత్వ పాఠశాలల చుట్టే తిరుగుతుంటాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వీటితో పట్టింపులేకుండా తరగతులు కొనసాగించడం, గుణాత్మకత పెంచడానికి ప్రాధాన్యత ఇస్తుంటారు. తరచూ పరీక్షల పేరిట ఎప్పటికప్పుడు విద్యార్థుల వెనుకబాటును గుర్తించి ప్రోత్సహిస్తుంటారు. ఇలాంటి ఎన్నో కారణాలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గేందుకు కారణమవుతున్నాయని విద్యానిపుణులు అంటున్నారు. పదిమంది కంటే తక్కువ విద్యార్థులు కల్గిన పాఠశాలలు 4,398 ఉన్నాయి. ఈ పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో మూతపడే అవకాశాలు ఉంటాయి. 30మందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 18వేలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి సంక్లిష్ట పరిస్థితి కొనసాగుతోంది. గతంలో పదిమంది లోపు విద్యార్థులు ఉండే పాఠశాలలను సమీపంలోని మరో పాఠశాలలో విలీనం చేయడం లేదా మూసివేయాలని భావించారు. ఈ ఏడాది అటువంటి పాఠశాలల సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏటా ఇలాంటి పాఠశాలల సంఖ్య పెరుగుతోంది. 2021లో పదిమందిలోపు విద్యార్థులు గల పాఠశాలలు 1800 ఉండేవి. 2023 నాటికి ఈ సంఖ్య 3,646కు చేరింది. 2024 విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అందిన గణాంకాల ప్రకారం 4,398 పాఠశాలలకు పెరిగింది. ఏడాదిలోనే పదిమందిలోపు విద్యార్థుల పాఠశాలల సంఖ్య 700కు పెరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. 11-20 మంది దాకా కల్గిన పాఠశాలలు 7810కు పెరగగా, 21-30మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 5362కు చేరాయి. ఈ అన్ని పాఠశాలలు ప్రాథమికమైనవి కావడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉచిత ప్రవేశం, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, క్షీరభాగ్య, మౌలిక సదుపాయాలు వంటి సౌలభ్యాలు పెంచారు. అయినా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. అతిథి ఉపాధ్యాయుల నియామకాలతోపాటు పలు పథకాలను అమలు చేస్తున్నారు. హాసన్ జిల్లాలో అత్యధికంగా పదిమందిలోపు విద్యార్థులు ఉండే పాఠశాలలు 490 ఉండడం గమనార్హం.

త్వరలో జిల్లాలవారీ సమీక్ష : మంత్రి

ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప మాట్లాడుతూ ఇటీవల పాఠశాలల విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడం బాధ కలుగుతోందన్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకమైన పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. జిల్లాలవారీగా సమీక్ష చేసి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నం చేస్తామని అన్నారు.

బీజేపీ, జేడీఎస్ కుట్రలను అడ్డుకుంటాం

శిడ్లఘట్ట, ఆగస్టు 21: ముఖ్యమంత్రి సిద్దరామయ్యది అవినీతి రహిత రాజకీయ జీవనమని, ఆయనపై బీజేపీ, జేడీఎస్ ఇరికించేందుకు కుట్రలు చేస్తున్నాయని కేపీసీసీ కో-ఆర్డినేటర్ రాజీవ్‌గౌడ తెలిపారు. పట్టణంలో బుధవారం కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో సిద్దరామయ్యకు మచ్చ లేదన్నారు. గ్యారెంటీలతో ఉత్తమ పాలన అందిస్తున్నారని తెలిపారు. సిద్దరామయ్యకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకనే బీజేపీ, జేడీఎస్ కలసికట్టుగా కుట్ర పన్ని రాజ్‌భవన్‌ను దుర్వినియోగం చేశాయని ఆరోపించారు. కోట్లాదిమంది ప్రజలు సిద్దూకు అండగా ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ భవన్ నుంచి కోటె సర్కిల్ మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. బీజేపీ, జేడీఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలో కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉదయ్‌శంకర్, డీసీసీ బ్యాంకు మాజీ ఉపాధ్యక్షుడు డాల్ఫిన్ నాగరాజ్, మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్మిన్‌తాజ్, కాంగ్రెస్ ప్రముఖులు నటరాజ్, అప్సర్‌పాషా, బంగారప్ప, గూడలి నారాయణస్వామి, రవిగౌడ తదితరులు పాల్గొన్నారు.


జైళ్లలో గన్, గంజాయి లభ్యం

ఆశ్చర్యం వ్యక్తం చేసిన హైకోర్టు

పరిశీలించాలని మౌఖిక ఆదేశం

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కారాగారాల్లో గన్, గంజాయి, బుల్లెట్ వంటివి అందుబాటులో ఉన్నాయని, కొన్నిచోట్ల జైలు అధికారులే ఖైదీలకు సుపారీ ఇస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు హైకోర్టు ముందుకు వచ్చాయి. దీనిపై న్యాయమూర్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ జైళ్లలో నిషేధిత వస్తువులు లభిస్తుండడంపై పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం మౌఖికంగా సూచించారు. నగరంలోని పరప్పన అగ్రహార జైలులో విచారణ ఖైదీ ఒకరికి ఇంటి భోజనం కల్పించేందుకు సంబంధించి జైలు అధికారులకు సూచించేలా మార్గదర్శకం చేయాలని ఖైదీ బంధువులు హైకోర్టుకు అర్జీ సమర్పించారు. అర్జీదారుడి తరఫున న్యాయవాది సిరాజుద్దీన్ అహ్మద్ హాజరై తన కక్షిదారుడి అల్లుడు పరప్పన అగ్రహారజైలులో విచారణ ఖైదీగా ఉన్నారని వివరించారు. అతడికి ఇంటి భోజనం ఇచ్చేందుకు అనుమతించాలని జైలు అధికారులు, కారాగృహశాఖ డీజీపీకి విన్నవించామన్నారు. ఇంటి భోజనం అనుమతిస్తే జైలుభద్రతకు భంగం కలుగుతుందని బదులిస్తున్నారని అన్నారు. బళ్లారి, బెళగావి, చిత్రదుర్గ జైళ్లలో ఖైదీలకు ఇంటి భోజనం ఇచ్చేందుకు అనుమతిస్తున్నారని, బెంగళూరులో మాత్రం వదలడం లేదని వివరించారు. అంతేకాకుండా రాష్ట్రంలోని జైళ్లలో నిషేధిత వస్తువులు సరఫరా చేస్తున్నారని న్యాయవాది ప్రస్తావించారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ నిషేధిత వస్తువులు అంటే ఏమిటన్నారు. సిరాజుద్దీన్ అహ్మద్ బదులిస్తూ మొబైల్, గంజాయి, గన్, బుల్లెట్ వంటివి జైలు అధికారులే సమకూరుస్తున్నారని చెప్పారు. దీని గురించి ఒక ఖైదీ అతడి భార్యకు తెలిపారని అన్నారు. సదరు ఖైదీ భార్య కారాగృహ డీజీపీకి ఇ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సదరు ఖైదీని సింగిల్ సెల్‌కు మార్చారన్నారు. కాగా జైలర్ ఒకరు ఖైదీలకు సుపారి ఇస్తున్నారంటూ తీవ్రమైన ఆరోపణ చేశారు. ఆరోపణలపై న్యాయమూర్తి స్పందిస్తూ ఘటన తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు జైళ్లలో సమస్యలపై పరిశీలన చేయాలని సూచించారు. కాగా సిరాజుద్దీన్ అహ్మద్ సమర్పించిన అర్జీని సెప్టెంబరు 5కు వాయిదా వేశారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.70	1,627.30
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	30,893	874
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,658	10,270
సామర్థ్యం (టీఎంసీలు)	78.80	84.27

శ్రీకృష్ణదేవరాయ వర్శిటీలో బంజారా పీఠం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కులపతి మునిరాజ్

బళ్లారి సిటీ, ఆగస్టు 21: విజయనగరం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీలో విరాజిల్లుతున్న లంబాణీ కళలను జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు బంజారా అధ్యయన పీఠాన్ని ప్రారంభించనున్నట్లు కులపతి ప్రొ.మునిరాజు తెలిపారు. యూనివర్శిటీ ఆడిటోరియంలో బంజారా సాహిత్యం, జీవితం అనే అంశంపై ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సదస్సును బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రొఫెసర్ రుద్రేశ్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, ఉపసంస్కృతుల కోసం కృషి చేయాలన్నారు. కన్నడ విభాగం డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ లంబాణీ జాతిలో వివాహ నియమాలు విశిష్టమైనవన్నారు. గిరిజనుల్లో ప్రధాన సంస్కృతి కింద ఉపసంస్కృతులు పుట్టుకొచ్చాయని వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా లక్షణనాయక్, బెళగల్లు సురేశ్‌నాయక్, మీత్యానాయక్, శివప్రకాశ్, రంగనాథ్, వివిధ సంస్థల డీన్లు , వివిధ విభాగాల అధిపతులు,లెక్చరర్లు, పరిశోధక విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజీవీల్ ట్రాక్టర్లను నడపవద్దు: డీసీ



రోడ్డుపై వెళుతున్న కేజ్ వీల్స్ ట్రాక్టర్

బళ్లారి సిటీ, ఆగస్టు 21: రోడ్లపై వరిసాగుకు వినియోగించే కేజీవీల్ ట్రాక్టర్లను నడపరాదని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఆదేశించారు. జిల్లాలోని అచ్చుకట్టు ప్రాంతంలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. రైతులు భూమి తయారీకి ట్రాక్టర్‌తో నడిచే వివిధ పనిముట్లను ఉపయోగిస్తారు. ప్రధానంగా వరిపంటను నాటడానికి ముందు వరి పొలం తయారీకి కేజ్‌వీల్స్‌ను ఉపయోగిస్తారు. ట్రాక్టర్‌టైర్లకు బదులు ఇనుముతో తయారు చేసిన ఈ వీల్స్‌ను అమర్చి దమ్ముచేస్తారు. అయితే దున్నిన తర్వాత ట్రాక్టర్ వీల్స్ మార్చకుండానే రైతులు రోడ్డుపై అలాగే వెళుతున్నారు. దీనివల్ల రోడ్డుపై లోతైన గుర్తులు ఏర్పడి రోడ్లు చెడిపోతున్నాయి. పబ్లిక్ రోడ్ల మన్నికను దృష్టిలో ఉంచుకుని రైతులు తారురోడ్డుపై కేజ్‌వీల్స్ తో కూడిన వాహనాలను నడపకూడదని అలా చేస్తే నిబంధనల ప్రకారం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్ మెంట్ ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ ధర్నా



అసోసియేషన్ సభ్యులతో అధ్యక్షుడు మించు శ్రీనివాస్

బళ్లారిరూరల్, ఆగస్టు 21: లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో బుధవారం శాంతియుతంగా ధర్నా చేపట్టారు. లారీ సరుకు రవాణా ధరలు పెంచాలని డిమాండ్ చేస్తూ గత నెలలో ఐదు రోజులు ధర్నా చేపట్టగా బళ్లారి కలెక్టర్ ఆ డిమాండ్లు పరిష్కరిస్తామని హామీఇచ్చారని, కాని ఆ డిమాండ్లు నెరవేర్చకపోవడంతో బుధవారం నుంచి మరలా సమ్మెను ప్రారంభించామని లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మించు శ్రీనివాస్ తెలిపారు. ఇంతవరకు తమ సమస్యను పట్టించుకునే నాథుడే కనిపించలేదని, శాంతియుతంగా సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ ఉపాధ్యక్షులు నూర్ మహమ్మద్, మహబూబ్ బాషా, ప్రవీణ్ కుమార్, ఎండీ ఫయాజ్, శ్రీనివాసులు, రామ్‌కుమార్ పలు లారీ ఓనర్లు, డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

అలరించిన యుగళ శతావధానం



అవధానులను సభకు పరిచయం చేస్తున్న కోఆర్డినేటర్



సచ్చిదానంద స్వామి తరపున పృచ్ఛకులను సన్మానిస్తున్న అవధాని వద్దిపర్తి

నగరంలోని హరిహరపురం బాలాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం యుగళ మహాశతావధానం ఘనంగా ప్రారంభమైంది. సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్, ఢడియం భరతశర్మ నిర్వహించిన ఈ శతావధానం ఆద్యంతం బళ్లారి వాసులను అలరించింది. అవధానులిద్దరు పృచ్ఛకులు సంధించిన సమస్యలకు వెనువెంటనే పద్యాలతోనే సమాధానం చెప్పిన తీరు ఆహూతులను ఆనందింపజేసింది. ముఖ్యంగా పుట్టపర్తికి, వద్దిపర్తికి తేడా చెప్పమని కోరినప్పుడు అవధాని స్పందించిన తీరుపై కరచాలధ్వనులతో సభికులు హర్షం వ్యక్తం చేశారు. గంగ, యమున, సరస్వతి, నర్మద నదులపై వారు చెప్పిన పద్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్వయం ప్రకాశ సచ్చిదానందస్వామి వారి ఆశీస్సులతో జరిగిన ఈ శతావధానంలో బుధవారం 25 సమస్యలు, దత్తపదులను పూరించారు. గురు, శుక్రవారాల్లో కూడా మహాశతావధానం కొనసాగనుంది. -- బళ్లారి సిటీ

బళ్లారి ఏపీఎంసీలో లుకలుకలు

● ఉపాధ్యక్ష స్థానానికి హులెప్ప రాజీనామా

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 21: బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల సమితికి రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పాలనా మండలిలో అపుడే లుకలుకలు ప్రారంభమయ్యాయి. ఏపీఎంసి ఉపాధ్యక్ష స్థానానికి బుధవారం హులెప్ప రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను అసిస్టెంట్ సెక్రటరీ ఎర్రిగౌడకు అందజేసినట్లు ఆయన తెలిపారు. బళ్ళారి ఏపీఎంసి పాలక మండలి కాలపరిమితి గత ఏడాది శాసనసభ ఎన్నికల కోడ్‌తోనే ముగిసిపోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఏడాది పాటు వివిధ మండళ్ళకు సంబంధించి నామినేటెడ్ స్థానాలు భర్తీ చేయలేదు. ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కోడ్ ప్రకటనకు ముందే రాష్ట్రంలో పలు మండళ్ళు, ఏపీఎంసిలకు నామినేటెడ్ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా బళ్ళారి ఏపీఎంసికి ఈ సంవత్సరం మార్చి16న పదకొండు మంది నామినేటెడ్ సభ్యులతో పాలకమండలి ఏర్పాటుచేశారు. ఏపీఎంసి అధ్యక్షుడిగా బళ్లారి నగరానికి చెందిన కట్టిమనె నాగేంద్రప్పను, ఉపాధ్యక్షులుగా గ్రామీణ విభాగం నుంచి కొళగల్లు గ్రామానికి చెందిన హులెప్పతో పాటు మరో 9మంది సభ్యులను నామినేట్ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులు జూన్ 13వ తేదీన అధికార బాధ్యతలు స్వీకరించారు. అయితే బాధ్యతలు స్వీకరించి పట్టుమని రెండు నెలలు గడవక మునుపే బళ్ళారి ఏపీఎంసి పాలనా మండలిలో లుకలుకలు ప్రారంభం అయ్యాయి. పాలనా మండలిలో ఎంపికైన వారిలో 9మంది బళ్ళారి రూరల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీ మంత్రి నాగేంద్ర మద్దతుదారులే కావడం గమనార్హం. ప్రస్తుతం వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అక్రమాల్లో మాజీ మంత్రి నాగేంద్ర జైలు పాలుకాగా... ఆయన ప్రభావం పరోక్షంగా ఏపీఎంసి పాలనా మండలిపై పడిందని సభ్యులు అంటున్నారు.

తమ నాయకుడు జైలుకు వెళ్ళిన కారణంగా నాగేంద్ర మద్దతు దారులైన ఏపీఎంసి ఉపాధ్యక్షులతో పాటు సభ్యులను చిన్నచూపు చూస్తున్నారని, అందుకు మనసు నొచ్చుకుని ఉపాధ్యక్షులుగా ఎన్నికైన హులెప్ప తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధ్యక్షులు నాగేంద్రప్పతో పాటు మరో సభ్యుడికి స్థానిక ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉండడంతో బళ్లారి ఏపీఎంసిలో ఏకపక్ష నిర్ణయాలు జరుగుతుండడమే హులెప్ప రాజీనామాకు దారితీసిందని అంటున్నారు. జరిగిన సమావేశాలు పూర్తి స్థాయిలో కోరం లేకుండా ముగిసిన విషయాన్ని బయటకు పొక్కకుండా సభ్యులు, అధికారులు జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. రాజీనామాపై ఉపాధ్యక్షులు హులెప్పను వివరణ కోరగా... మండలి నిర్ణయాలు నచ్చడం లేదని, గౌరవం లేని చోట తాను ఇమడలేనని అందుకే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.



రాజీనామా పత్రాన్ని అసిస్టెంట్ సెక్రటరీ ఎర్రిగౌడకు అందజేస్తున్న హులెప్ప

ఉపాధ్యక్షుడి రాజీనామా ఆయన వ్యక్తిగతం

బళ్లారి ఏపీఎంసీ ఉపాధ్యక్ష స్థానానికి హులెప్ప రాజీనామా చేసిన విషయంపై అధ్యక్షులు నాగేంద్రప్పను వివరణ కోరగా, ఉపాధ్యక్షులు రాజీనామా చేసిన విషయం తనకేమి తెలియదని, రాజీనామా చేయడం ఉపాధ్యక్షుల వ్యక్తిగత విషయమని, తానేమి చెప్పలేనని అన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న కంప్లి రోడ్లు

కంప్లి, ఆగస్టు 21 : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలో పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని జవుకు, జీరుగనూరు రోడ్డు మార్గంలో నారళ్ల వాగు ప్రవాహానికి రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే షుగర్ ఫ్యాక్టరీ చిక్కజాగనూరు వంతెన కూలింది. దీంతో పాటు రైతులు వేసుకున్న పంట పొలాల్లో నీరు నిలిచిపోయి రైతన్నలు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైభాగంలో భారీ వర్షాలు కురవడంతో వాగుల్లో ఇప్పటికీ నీటి ఉధృతి తగ్గలేదు. మొత్తానికి రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, వాగులు జలమయమయ్యాయి.



షుగర్ ఫ్యాక్టరీ - చిక్కజాగనూరు మధ్య కూలిన కల్వర్టు

ముడా కేసులో సీఎంపై పసలేని ఆరోపణలు

కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ఆగ్రహం

కంప్లి, ఆగస్టు 21 : ముడా కేసు విషయంలో ముఖ్యమంత్రిపైనే లేనిపోని ఆరోపణలు చేయడం వారికి అనుగుణంగా గవర్నర్ నోటీసులు జారీ చేయడం సరైంది కాదని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ బీజేపీ నాయకులకు ఒక ఆటబొమ్మగా మారారని ఆయన ఆరోపించారు. ఏపీఎంసీ వద్ద కొట్టాల రోడ్డు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ నాయకులు తమ నాయకుడైన సిద్దరామయ్యపై ఎన్ని కుతంత్రాలు చేసినా నిజాయితీ గెలుస్తుందన్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి తాలుకా స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా నిరసనలు వుంటాయన్నారు. అలాగే కంప్లి పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నికలు జరిగి అభివృద్ధి జరిగే సమయంలో కోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడం సరైంది కాదన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన రైతన్నలకు తమ నాయకులతో చర్చించి నష్టపరిహారం అందేలా చేపడతామన్నారు. అలాగే గ్రామాల్లో నీరు చేరుకుని ఇళ్లు ధ్వంసమైపోయినవారిని ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ ఉపాధ్యక్షులు శరణు గౌడ, పురసభ నామినేట్ మెంబర్ మౌనేష్, కృష్ణ, జేఈ ఆనంద్, ప్రముఖులు ఎం సుధీర్, ఏసీ దానప్ప, వన్నూరప్ప, సుధాకర్, వాల్మీకి రఘు, చంద్రశేఖర్‌గౌడ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



కొట్టాల రోడ్డుకు భూమిపూజ చేపడుతున్న ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కదిలిన ఏపీఎంసీ అధికార బృందం

● పారిశుధ్యపనులు ప్రారంభం



ఏపీఎంసీ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 21: ఎట్టకేలకు ఏపీఎంసీ అధికారుల్లో కదలిక వచ్చింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ఏపీఎంసీ మార్కెట్‌లో నెలకొన్న మురికి వాతావరణంపై 'ఏపీఎంసీలో బురద కాయగూరలు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు, సిబ్బంది ఏపీఎంసీ కూరగాయల మార్కెట్‌లో నెలకొన్న అపరిశుభ్రత, బురదమయమైన పరిసరాలను క్లీన్ చేయడానికి నడుం బిగించారు. గతంలో ఆంధ్రజ్యోతి దిన పత్రిక పలు కథనాలు ప్రచురించి అధికారులకు చురకలు అంటించిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం కార్మికులతో ట్రాక్టర్లలో కుళ్ళిపోయిన కూరగాయలు తొలగించడంతో పరిసరాలు శుభ్రపడ్డాయి. ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో కదలిక తెచ్చినందుకు స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

పోటీ పరీక్షలపై ఆత్మవిశ్వాసం అవసరం



మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తదితరులు

బళ్లారి సిటీ, ఆగస్టు 21: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత ఆత్మవిశ్వాసంతో పాటు నిరంతరం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా యువతకు పిలుపునిచ్చారు. నగరంలోని జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో బుధవారం జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుద్యోగ పట్టభద్రులకు పోటీ పరీక్షలలో ముందస్తు శిక్షణ కోసం ఏర్పాటుచేసిన వన్‌డే వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్దమయ్యే విద్యార్థులు ప్రణాళికాబద్దంగా సమయానికి అనుగుణంగా సాధన చేయాలని సూచించారు. జిల్లాఎస్పీ శోభరాణి మాట్లాడుతూ ఎలాంటి ఆటంకాలు వచ్చినా వినకుండా పరీక్షకు సన్నద్ధమై ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అభ్యర్థులను ప్రోత్సహించారు. కేఏఎస్, ఎఫ్‌డీఏ,ఎస్‌డీఏ పరీక్షల తయారీ కోసం మొత్తం 125మంది అభ్యర్థులకు 5నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. ఇందుకోసం రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 29 ఆఖరితేదీగా ప్రకటించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, ఆగస్టు 21 : మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సిరుగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. సిరుగుప్ప పట్టణంలోని టీడీపీ భవనంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పరికరాలను పంపిణీ చేశారు. మిక్సీలు, కుక్కర్లను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల విద్యాభ్యాసంపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా జెడ్పీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, తాలుకా శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై అంగళ్లను తొలగించాలి

కంప్లి, ఆగస్టు 21 : కంప్లి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎదురు మసీదు వరకు ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన అంగళ్లను వెంటనే తొలగించాలని హసురుసేన తాలుకా సంచాలకులు చెన్నప్ప డిమాండ్‌చేశారు. బుధవారం పురసభ ముఖ్యఅధికారి దుర్గన్నకు ఈ మేరకు మనవిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్‌కుమార్‌రోడ్డులో ఫుట్‌పాత్ పనులు నాసిరకంగా జరిగాయని, జరిగిన పనులు సరిగా లేకపోవడంతో వాహనాలు నిలబెట్టుకునేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికి తోడు కిరాణ, టీ , పూల వ్యాపారులు ఫుట్‌పాత్‌పై అంగళ్లు ఏర్పాటుచేసుకుని వ్యాపారం చేస్తున్నారన్నారు. దీని వల్ల ప్రజలకు ట్రాఫిక్ సమస్య ఏర్పడి ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వారితో పాటు శంభులింగ, రామ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

గణేశ చతుర్థి నిర్వహణపై ముందస్తు సమావేశం



ముందస్తు సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు అధికారి

హోసూరు ఆగస్టు 21 : రానున్న గణేశ చతుర్థి సందర్భంగా హోసూరు సిప్‌కాట్ పోలీసు స్టేషన్‌లో బుధవారం ముందస్తు సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు వ్యాప్తంగా విగ్రహాల ప్రతిష్ఠాపనపై తమిళనాడు పోలీసు శాఖ డైరెక్టర్ శంకర్ జివాల్ జారీ చేసిన సర్క్యులర్‌కు సంబంధించిన మత్తిగిరి, సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వినాయక విగ్రహాలను పూజించే స్థలాలో ప్రజలు పాటించాల్సిన నిబంధనలను సమీక్షించారు. సర్క్యులర్ ప్రకారం విగ్రహం 10 అడుగుల కంటే ఎక్కువగా ఉండకూడదని, రసాయన మిశ్రమం లేని వినాయక విగ్రహాలను మాత్రమే ఉంచాలని, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్, ఆర్‌డీఓ లేదా డిప్యూటీ కలెక్టర్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాలల్లో లౌడ్‌స్పీకర్లను అమర్చడానికి స్థానిక సంస్థల నుంచి అనుమతి తీసుకోవాలని ఆంక్షలు విధించారు. ఇతర ప్రార్థనా స్థలాలు ఆసుపత్రులు, విద్యా సంస్థల దగ్గర విగ్రహాలు పెట్టరాదని, ఇతర మతాలకు చెందిన వ్యక్తుల మనోభావాలు దెబ్బతినేలా నినాదాలు చేయకూడదని పేర్కొన్నారు. వినాయక విగ్రహాల ఊరేగింపు మార్గంలో పటాకులు పేల్చకూడదని, గణేశ విగ్రహాలను మినీ లారీ, ట్రాక్టర్‌లో మాత్రమే తరలించాలని సర్క్యులర్‌లో సూచించారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య ఏర్పడితే విజిలెన్స్ కమిటీ లేదా ఉత్సవ కమిటీ బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు హిందు సంస్థలు, ప్రజలు పాల్గొన్నారు.

అటవీ శాఖలో పనిచేస్తున్న వైద్యుడి ఆత్మహత్య



ప్రకాశ్(ఫైల్)

హోసూరు ఆగస్టు 21 : అటవీ శాఖలో వైద్యుడుగా పనిచేస్తున్న ప్రకాశ్(40) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య కవిత తిరునేల్వేలీ జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. ఆయన హోసూరు మారుతీ నగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. ఆయన గత కొన్ని రోజులుగా తీవ్రమనస్తాపానికి గురైనట్లు సమాచారం ఈ క్రమంలో వీడియో రికార్డు చేసి భార్యకు పంపి అనంతరం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఇరుగుపొరుగు వారు వెంటనే హడ్కో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పారిశుధ్య కార్మికులకు ఉపాధి మెరుగుదలపై సమావేశం

హోసూరు ఆగస్టు 21 : హోసూరు పారిశుధ్య కార్మికుల జీవనోపాధి మెరుగుదల అవగాహన సమావేశం కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం జరిగింది. సమావేశానికి హోసూరు కార్పొరేషన్ మున్సిపల్ కమీషనర్ శ్రీకాంత్ అధ్యక్షత వహించగా, మున్సిపల్ సంక్షేమాధికారి డాక్టర్ ప్రభాకరన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో పారిశుధ్య కార్మికులందరికీ జీవనోపాధి అభివృద్ధి పథకాలు, విద్య, వ్యాపార రుణాలు, అవగాహనకు సంబంధించి పథకాలు, విద్య వ్యాపార రుణాలు, గృహ రుణ సౌకర్యాలు గురించి వివరించారు. సమావేశంలో జిల్లా మేనేజర్ (తాడ్కో) జిల్లా పయనీర్ బ్యాంకు మేనేజర్, బ్యాంక్ మేనేజర్ పాల్గొని స్వచ్ఛ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో జరిపిన సమావేశం

సకాలంలో పన్నులు చెల్లించాలి

నగరసభ కమిషనర్ సిద్ధయ్య హిరేమఠ

రాయచూరు, ఆగస్టు 21 : నగరంలోని స్థిరాస్తిదారులు, వ్యాపారులు సకాలంలో ఆస్తిపన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగరసభ కమిషనర్ సిద్ధయ్య హిరేమఠ కోరారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్నుల వసూళ్ల కోసం తాము ప్రత్యేక కార్యచరణకు దిగినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నగరంలోని ప్రముఖ వ్యాపార కేంద్రంగా ఉన్న నృపతుంగ హోటెల్ వద్ద నుంచి కార్యచరణను కమిషనర్ ప్రారంభించారు. పలు పేరున్న వ్యాపార కేంద్రాలు ఆస్తులకు సంబంధించి ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకపోవడం సమస్యగా మారిందని ఈ సందర్భంగా కమిషనర్ అన్నారు. దీని పై సమీక్ష నిర్వహించిన జిల్లాధికారి వసూళ్ల కోసం ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చిన నేపద్యంలో తాము ఇప్పటికే పెండింగ్ జాబితాను సిద్ధ చేసి కార్యచరణ ప్రారంభించినట్లు తెలిపారు. కాగా తాము నేరుగా వ్యాపార కేంద్రాలు, ఇళ్ల వద్దకు వచ్చి అడిగిన సందర్భంలోను పన్నులు చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ చేసుకోకపోతే అలాంటి వ్యాపారాలను ఖచ్చితంగా మూసివేస్తామని ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ హెచ్చరించారు. కాగా స్థానిక లక్ష్మీబార్ అండ్ రెస్టొరెంట్ గత నాల్గు ఏళ్లుగా ఆస్తి పన్నులు చెల్లించకపోవడాన్ని అధికారులు గుర్తించి కార్యచరణకు దిగిన నేపథ్యంలో కమిషనర్ చేతికి బార్ యజమాని రూ.7.04 లక్షల చెక్కును అందజేశారు. పలువురు తాగునీటి కనెక్షన్‌కు సంబంధించి కూడా బిల్లులు పెండింగ్‌లో పెట్టారని ఇలాంటి వారికి నల్ల కనెక్షన్ రద్దు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ఈసందర్భంగా కొన్ని దుకాణాలను అధికారులు సీజ్ చేయగా మరి కొన్ని చోట్ల తాగునీటి కనెక్షన్‌లను నిలిపివేశారు.



దుకాణాలకు తాళాలు వేసి సీజ్ చేస్తున్న నగరసభ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రాయచూరు, ఆగస్టు 21 : రాయచూరు-మంత్రాలయం మార్గంలో మంగళవారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో మహిళ మృత్యువాత పడింది. విజయపుర ప్రాంతానికి చెందిన వ్యక్తులు కారులో మంత్రాలయంవైపు వెళుతూ రాయచూరు తాలూకాలోనని గుంజళ్లి-హెంచనాళ మధ్య రోడ్డుపై ఆగిఉన్న లారీని ఢీకొట్టారు. వేగంగా వెళుతున్న కారు లారీని ఢీకొట్టిన సందర్భంగా అందులో ప్రయాణిస్తున్న మహిళ అన్నపూర్ణమ్మ(35) తీవ్రంగా గాయపడగా ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తుండగా మృత్యువాతపడింది. ఆమె సోదరుడు నవీన్‌కు గాయాలుకాగా ఆయనను చికిత్స కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

డాక్టర్ వి. రాఘవన్ (జయంతి)



సంస్కృత భాషా పండితులు, సంగీత కర్త 'పద్మభూషణ్' గ్రహీత వెంకటరామన్ రాఘవన్ 1908 ఆగస్టు 22న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూరులో జన్మించారు. సంగీతం, సంస్కృతంలో సౌందర్యశాస్త్రం తదితరాలపై 120కు పైగా పుస్తకాలు, 1200కుపైగా రచనలు చేశారు. అలంకార, నాట్యశాస్త్రాలలో డాక్టరేట్ పొందారు. 'శ్రీరంగ ప్రకాశ'ను సంస్కృతంలోకి అనువాదం చేసి సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి 1944 నుంచి తుదిశ్వాసవరకు కార్యదర్శిగా పనిచేశారు. గురువు చంద్రశేఖరానంద సరస్వతిపై 'చంద్రశేఖరం ఆశ్రయే' పాటను రాశారు. 1979 ఏప్రిల్ 5న కన్నుమూశారు.

పీవీఆర్‌కే ప్రసాద్ (జయంతి)




టీటీడీ ఈఓగా చిరపరిచితులైన పీవీఆర్‌కే ప్రసాద్ 1941 ఆగస్టు 22న నెల్లూరు జిల్లా గూడూరులో జన్మించారు. 1966 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన సబ్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా ఉత్తమసేవలందించి ప్రజాదరణ పొందారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు మీడియా సలహాదారుగా వ్యవహరించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్టు ఛైర్మన్‌గాను, ఇతర కీలక హోదాలలో కొనసాగారు. ప్రధానంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పాలనా పరమైన సంస్కరణలు తెచ్చి భక్తుల సేవలకు ప్రాధాన్యత ఇచ్చారు. రిటైరయ్యాక కూడా టీటీడీ సలహాదారుగా వ్యవహరించారు. హిందూధర్మ పరిరక్షణ ట్రస్టుకు ఛైర్మన్‌గా వ్యవహరించారు. తన అనుభవాలతో ఎన్నో పుస్తకాలు రాశారు. రాష్ట్రరత్న, శ్రీకృష్ణ అనుగ్రహ, రాజర్షి వంటి గౌరవాలు అందుకున్నారు. 2017 ఆగస్టు 21న కన్నుమూశారు.

డాక్టర్ యూఆర్ అనంతమూర్తి (వర్ధంతి)



కన్నడ సాహితీవేత్త ఉడుపి రాజగోపాలాచార్య (యూఆర్) అనంతమూర్తి 1932 డిసెంబరు 21న శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి తాలూకా మేళిగె గ్రామంలో జన్మించారు. 'పద్మభూషణ్' గ్రహీత. కాలానికి అనుగుణమైన రచనలు చేశారు. సాహిత్యంలో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారం, కేంద్రం నుంచి పద్మ భూషణ్ పురస్కారం అందుకున్నారు. కొన్ని నవలలు, చిన్నకథలు సినిమాలుగా రూపొందించారు. మైసూరు యూనివర్సిటీలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి వైస్‌చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. బెంగళూరు సహా పది నగరాలకు ఆయన సూచించిన పేర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. 2014 ఆగస్టు 22న కన్నుమూశారు.

చిరంజీవి (పుట్టినరోజు)



తెలుగు సినీ రంగంలో మెగా స్టార్‌గా పేరొందిన 'పద్మభూషణ్' గ్రహీత చిరంజీవి 1955 ఆగస్టు 22న పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో జన్మించారు. అసలు పేరు కొణిదెల శివశంకర వర ప్రసాద్. తెలుగు సినీరంగంలోనే కాక జాతీయ స్థాయిలోనూ పేరొందారు. కెరీర్‌లో 150కు పైగా సినిమాలలో నటించారు. దక్షిణాది నుంచి తొలిసారిగా 1987లో ఆస్కార్ ప్రదానోత్సవానికి ఆహ్వానించబడ్డారు. 'రుద్రవీణ'కు జాతీయ పురస్కారం దక్కింది. 4 నంది అవార్డులు, 10 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర గౌరవాలు అందుకున్నారు. ఐఎస్ఎల్ క్లబ్ కేరళ బ్లాస్టర్స్ ఎఫ్‌సీకి సహభాగస్వామ్యం కలిగారు. ట్రస్టు ద్వారా ఐబ్యాంక్, బ్లడ్‌బ్యాంకులతో సమాజసేవ అందిస్తున్నారు. కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. 2022లో ఐఎఫ్ఎఫ్ఐ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నారు.

వసంతలక్ష్మి నరసింహాచారి (పుట్టినరోజు)



వసంతలక్ష్మి 1954 ఆగస్టు 22న ప్రకాశం జిల్లా కనిగిరిలో జన్మించారు. భరతనాట్యం, కూచిపూడి లలో కొరియో గ్రాఫర్‌గా రాణించారు. భర్త నరసింహాచారితో కలసి 1969లో కళా సమర్పణ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలతో దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింప చేశారు. నట్టువాంగంలోనూ సత్తా చాటు కోగా వీణా వాదకురాలి గాను రాణించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, లెజెండరీ ఉమెన్ అవార్డు, నృత్య కళానిధి ఇతర పురస్కారాలు అందుకున్నారు.

బీపీఓ ఉద్యోగాలకు మేళా

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 21: వివిధ సంస్థల్లోని బీపీఓ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.20వేల నుంచి రూ.25వేల జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులని వివరించారు. 27న కళాశాలలో నిర్వహించే మేళాను ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106399029, 8790172463, 778060993 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అనంతపురం కల్చరల్/క్రైం, ఆగస్టు 21: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సమాజంలో సెక్స్ వర్కర్లకు సమాన హక్కులు, ప్రాథమిక హక్కులు ఉన్నాయన్నారు. వారికీ చట్టాలు వర్తిస్తాయని వివరించారు. బుధవారం రాజహంస డీలక్స్ కన్వెన్షన్ హాల్‌లో సంగ్రామ్ సంస్థ, నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ సెక్స్ వర్కర్స్, సింధూర ఆర్గనైజేషన్, ఝాన్సీ లక్ష్మీ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులు సెక్స్ వర్కర్లకు సముచిత గౌరవం ఇవ్వాలని సూచించారు. సెక్స్ వర్కర్లందరూ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయవాది పద్మజ మాట్లాడుతూ జీవనోపాధికోసం మాత్రమే కొందరు స్వచ్ఛందంగా ఈ వృత్తిని ఎంచుకున్నారని, అలాంటి వారిని బలవంతంగా ప్రేరేపించడానికి వీలులేదని, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత వ్యవస్థలపై ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, రెడ్స్ పీడీ చిట్టప్ప, సెరా పీడీ కుళ్లాయప్ప, శాంతి, పోతులయ్య, హరికృష్ణ, పద్మజ, నాగమణి, ఝాన్సీ, పుష్పావతి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు

దొమ్మసంద్ర, ఆగస్టు 21: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు సిబ్బంది నిరంతరం నిమగ్నమై ఉన్నారని లయన్స్‌క్లబ్ ఛైర్‌పర్సన్ లయన్ పూజాచంద్ర అభిప్రాయపడ్డారు. ఆనేకల్ తాలూకాలోని సర్జాపుర పోలీస్‌స్టేషన్ ఆవరణలో లయన్స్‌క్లబ్ సర్జాపుర, సిటిజన్ ఫోరం పదాధికారులతో కలసి బుధవారం రక్షాబంధన్ ఆచరించారు. పోలీసు సిబ్బందికి హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ ధర్మంలో అక్కతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లమధ్య బంధం అపురూపమైనదన్నారు. పెద్దల ఆశీస్సులు, అభిమానం వారికి రక్షగా ఉంటుందనే భావన ఉందన్నారు. సిటిజన్ ఫోరం ముఖ్యులు భరత్‌గౌడ మాట్లాడుతూ సమాజాన్ని రక్షించే పోలీసులతో కలసి రక్షాబంధన్ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐ డి.బి.చక్రి, సిబ్బంది ఉమా, మహేశ్, శివకుమార్, మల్లికార్జున్, లయన్స్‌క్లబ్ పదాధికారులు లయన్ అనుపమ, దీపా జేకాబ్, సుధా దినకర్, రేణుకా, మంజు, సిటిజన్ ఫోరం పదాధికారులు నిశా చక్రవర్తి, నీరజా విక్రమ, బిందుశ్రీన దుర్గా శంకర్, దబేశ్, రాజు, అపూర్వ శ్రీవత్సవ్, సత్యావధి, హేమలతా తదితరులు పాల్గొన్నారు.



పోలీసులతో లయన్స్‌క్లబ్, సిటిజన్‌ఫోరం పదాధికారులు

సమాజహితం కోసమే యోగి నారేయణ తత్వ సిద్ధాంతాలు



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సాహిత్యాన్ని ఏకకాలంలో మంచి మార్గంలో నడిపించిన యోగి నారేయణ తాతయ్య అంటూ మైసూరు యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి ఆచార్య రామనాథం నాయుడు అభిప్రాయపడ్డారు. మైసూరు ఓపెన్ యూనివర్సిటీలో యోగి నారేయణ తాత్విక చింతన అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. కులపతి ఆచార్య శరణప్ప వి హలసె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామనాథం నాయుడు మాట్లాడుతూ కైవార తాతయ్య సాహిత్యం తత్వ సిద్ధాంతాలు సమాజహితం కోసమే అన్నారు. కాలజ్ఞానాన్ని జీవనసత్యాలను భవిష్యత్తు ప్రజాజీవనానికి బాటలు కావాలని భావించారన్నారు. ఆయన ఆధ్యాత్మికంగా తత్వసిద్ధాంతాలతోనే మార్పుకు ప్రయత్నించాలన్నారు. తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ, అమెరికా నుంచి లెనిన్‌బాబు వర్చువల్ రూపంలో పాల్గొన్నారు. ఆచార్య ప్రవీణ్, డీన్ లక్ష్మి, హెచ్ శ్వేతల సమక్షంలో జరిగిన సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు తమ పత్రాలను సమర్పించారు. యోగి నారేయణ ఆదర్శజీవితం నేటి ప్రపంచానికి అనుసరణీయమని వక్తలు కొనియాడారు.

పౌరకార్మికుల సేవలు అభినందనీయం

బంగారపేట, ఆగస్టు 21: పట్టణాన్ని పరిసర ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచడంలో పౌర కార్మికుల సేవలు అభినందనీయమని వారి సమస్యలపై వెంటనే స్పందిస్తామని పురసభ నూతన అధ్యక్షుడు గోవింద అభిప్రాయపడ్డారు. పురసభ కార్యాలయ ఆవరణలో పౌర కార్మికుల నుంచి సన్మానం స్వీకరించి మాట్లాడారు. బంగారపేట పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచేందుకు తమ జీవితాన్ని లెక్కించకుండా శ్రమిస్తున్నారని వారు దేశసైనికులతో సమానులన్నారు. పట్టణ పరిధిలో స్వచ్ఛతను కాపాడడంతోపాటు తమ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని పౌరకార్మికులకు సూచించారు. పౌరకార్మికుల సంక్షేమంలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, సభ్యులు ఎస్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.



పౌరకార్మికులతో పురసభ నూతన అధ్యక్షుడు గోవింద

ప్లైవుడ్‌లో డ్యూరోప్లై సాధన

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్లైవుడ్ రంగంలో నాణ్యతలో రాజీ లేకుండా ఉత్పత్తులు మార్కెటింగ్ చేస్తున్నామని డ్యూరోప్లై సంస్థ సీఎండీ అఖిలేశ్ చిట్లింగియా ప్రకటించారు. ఈమేరకు బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీలో జరిగే 68వ మటీషియా ప్రదర్శనలో డ్యూరోప్లై తమ ఉత్పత్తులను ప్రదర్శింప చేయనుందన్నారు. డ్యూరోప్లై ఇంటీరియర్స్‌తోపాటు ఉడ్, వీనియర్ తలుపులు, బ్లాక్‌బోర్డులను దశాబ్దాల కాలంగా నాణ్యతతో అందిస్తోందన్నారు. డ్యూరోప్లై ది ట్రీ ఆఫ్ లైఫ్ గుర్తించేలా ఏర్పాటైందన్నారు. కంపెనీ సుదీర్ఘ పరంపర, వినియోగదారుల విశ్వాసానికి కట్టుబడ్డామన్నారు. డ్యూరో టైటానియం కూడా శక్తివంతంగా తీర్చామన్నారు. ఆరు బ్రాండ్‌లలో తమ ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చిందన్నారు.

వరల్డ్ అండర్ 20 అథ్లెటిక్స్‌కు రాష్ట్రం నుంచి ఆరుగురు

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అండర్ 20 అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్రం నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి పెరూ దేశంలోని లిమా నగరంలో జరిగే పోటీలలో వీరు పాల్గొననున్నారు. కర్ణాటక రాష్ట్ర అథ్లెటిక్స్ సంస్థ పేర్లను ప్రకటించింది. 400 మీటర్ల హర్డిల్స్‌లో శ్రేయా రాజేశ్, లాంగ్‌జంప్‌లో భావనా నాగరాజ్‌లు బరిలో దిగనున్నారు. ఉన్నతి అయ్యప్ప 100, 202 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొనన్నారు. 4/100 రిలేలో నియోల్ కార్నిలియో, సుదీక్ష వి, పురుషుల 4/400 విభాగంలో రిహాన్ సిలు పాల్గొననున్నారు. సహనా కుమారి జట్టు కోచ్‌గా వ్యవహరించనున్నట్టు అథ్లెటిక్స్ సంస్థ ప్రకటించింది.



ఎంపికైన క్రీడాకారులు

'నా కొడుకులను తుపాకీతో కాల్చి చంపండి'

» పోలీస్ కమిషనర్ ఎదుట తండ్రి ఆవేదన

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'నా కొడుకులతో పరువు పోతోందని వారిద్దరినీ తుపాకీతో కాల్చి చంపండని' హుబ్బళ్ళి నగర పోలీస్ కమిషనర్ ఎదుట తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. హుబ్బళ్ళిలో రెండు రోజులక్రిందట రౌడీల మధ్య గ్యాంగ్‌వార్ జరిగింది. రౌడీషీటర్ అఫ్తాబ్ కరడిగుడ్డపై పోలీసులు కాల్పులు జరిపారు. రౌడీషీటర్లు జావూద్ బేపారి, అఫ్తాబ్ కరడిగుడ్డ ముఠాల మధ్య గొడవలు ఉన్నాయి. పాత కక్షలతో వారు గ్యాంగ్‌వార్‌కు పాల్పడ్డారు. జావూద్‌పై దాడి చేసి తప్పించుకునే ప్రయత్నంలో పోలీసులు అఫ్తాబ్ కాలికి కాల్పులు జరిపి పట్టుకున్నారు. ఆ తర్వాత రౌడీ షీటర్ ఇంటిపై శశికుమార్ నేతృత్వంలో దాడి జరిపారు. దీంతో అఫ్తాబ్ తండ్రి మహ్మద్‌గౌస్ బుధవారం కమిషనర్ ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నారు. మహ్మద్ గౌస్ మాట్లాడుతూ నా ఇద్దరు కొడుకులు దారి తప్పారని కంటతడిపెట్టారు. హత్యా యత్నంలో ఇద్దరు పాల్గొన్నారని, వారి నుంచి మర్యాద పోయిందని, ఇద్దరినీ తుపాకీతో కాల్చి చంపాలని కన్నీరు పెట్టారు. ఈమేరకు కమిషనర్ శశి కుమార్ తీవ్రంగా హెచ్చరించారు. బుద్ధి చెప్పకపోతే మేమే తగిన గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.



కమిషనర్ శశికుమార్ ఎదుట మహ్మద్‌గౌస్

కళ్యాణదుర్గంలో బీడీ మంటలు

● కిందపడి పగిలిపోయిన పెట్రోల్ క్యాన్ ● బీడీ అంటించుకుని.. అగ్గిపుల్ల పడేసిన పొగరాయుడు ● భారీగా చెలరేగిన మంటలు

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 21: కళ్యాణదుర్గం మండల కేంద్రంలో పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోవడం, బీడీ తాగుతున్న వ్యక్తి అగ్గిపుల్ల పడేయటంతో భారీగా మంటలు చెలరేగాయి. స్థానికులు నీరు చల్లి మంటలను ఆర్పేయడంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో జేఎస్ శెట్టి అండ్ సన్స్ పెట్రోల్ బంకు ఉంది. ఓ వ్యక్తి బుధవారం ఉదయం 20 లీటర్ల క్యాన్‌లో పెట్రోల్ పట్టించుకున్నాడు. క్యాన్‌ను తన ద్విచక్ర వాహనంపై పెట్టుకుని సమీపంలో ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. బైక్ ఆపి మెడికల్ షాప్‌లోకి అతను వెళ్లిన కాసేపటి పెట్రోల్ క్యాన్ కింద పడి పగిలిపోయింది. పెట్రోల్ మొత్తం రోడ్డు వెంబడి పారింది. అదే సమయంలో అక్కడికి సమీపంలో ఓ వ్యక్తి బీడీ అంటించుకుని అగ్గిపుల్లను రోడ్డుపై వేశాడు. పెట్రోలు అగ్గిపుల్లను తాకగానే భారీగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. రోడ్డు పక్కన ఉన్న ఓ ద్విచక్ర వాహనం పాక్షికంగా దగ్ధమైంది. మంటలు చెలరేగిన ప్రాంతానికి కేవలం పది అడుగుల దూరంలో పెట్రోల్ బంక్ ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దుకాణదారులు సంపులో ఉన్న నీటితో మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలిస్తేగానీ బీడీ కాల్చిన వ్యక్తి కారణంగా మంటలు చెలరేగినట్లు బయటపడలేదు.





సీసీ ఫుటేజీలో రికార్డయిన బీడీ తాగుతున్న వ్యక్తి, వ్యాపించిన మంటలు

రావమ్మా..గంగమ్మా..!

● చెరువులకు జలకళతో గ్రామాల్లో హర్షం

● రైతుల ప్రత్యేక పూజలు



పొంగిపొర్లుతున్న పాలసముద్రం చెరువు



పరిగిలో గంగపూజ నిర్వహిస్తున్న తహసీల్దార్ హసీనాసుల్తానా



ఉధృతంగా ప్రవహిస్తున్న గోరంట్ల పెద్ద చెరువు

గోరంట్ల, ఆగస్టు 21: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. గోరంట్లలో మంగళవారం 35మి.మీ. బుధవారం 25మి.మీ.వర్షపాత నమోదయ్యింది. స్థానిక పెద్ద చెరువుకు నీటి ప్రవాహం మొదలయ్యింది. దీంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. రెండు నెలలుగా బోర్లు ఎండిపోయి పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా మారిందని, చెరువు నీటితో సమస్య తీరనుందని హర్షం వ్యక్తం చేశారు. పాలసముద్రం చెరువుకు గంగ పూజ నిర్వహించారు.

హిందూపురం(పరిగి) : ఎగువ కురిసిన భారీ వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. కర్ణాటక నుంచి జయమంగళి నది పొంగి పొర్లడంతో బుధవారం పరిగి చెరువుకు నీరు చేరింది. తహసీల్దార్ హసీనాసుల్తానా శీరంగరాజులపల్లి నదిలో బుధవారం గంగపూజ నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, డీఎస్ఎల్ శ్రీనివాసులు, ప్రవీణ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.



పాలసముద్రంలో గ్రామస్థుల గంగపూజ

నోటి సమస్యలపై సాంకేతిక పరిశోధనలు

RAMAIAH UNIVERSITY OF APPLIED SCIENCES

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దంతాల ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలే కాకుండా దవడల ద్వారా ఇటీవల తలెత్తుతున్న ఇబ్బందులపై సాంకేతిక పరిశోధనలు ముఖ్యమని ఓరల్ పాథాలజీ ప్రొఫెసర్ రూప ఎస్ రావ్ అభిప్రాయపడ్డారు. ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్స్‌లో నోటి సమస్యలపై లోతైన అధ్యయనం అనే అంశంపై చర్చాగోష్ఠి జరిపారు. దవడలలోని ఎముకలు లేదా నోరు, ముఖంలోని మృదువైన భాగాలలో సమస్యలు ఉంటే అది కేన్సర్‌గా భావించాల్సిన అవసరం లేదని అయితే దాని ప్రభావం పెరిగే అవకాశం లేకపోలేదన్నారు. దవడల్లో తలెత్తే సమస్యలపై ప్రాథమికంగానే గుర్తించడం ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతంతో దంతవైద్యులు సమగ్రమైన చికిత్సలు చేసేందుకు వీలుంటుందని, బయాప్సీ ద్వారా నమూనాలు సేకరించి అధ్యయనం చేసే వీలు ఉంటుందన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ దివ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు నివాస సౌలభ్యం

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా నివాస సౌలభ్యం కల్పించడం శ్రీరామ్ ప్రాపర్టీస్ సంస్థ లక్ష్యమని సీఎండీ మురళి మలయప్పన్ అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ రంగంలో శ్రీరామ్ ప్రాపర్టీస్ 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త బ్రాండ్‌తో ముందుకు వస్తున్నట్టు ప్రకటించారు. రానున్న మూడేళ్లలో రెట్టింపు విక్రయాలతో ఆదాయం పెంచుకోదలిచామన్నారు. నమ్మకం వినియోగదారుల విశ్వాసంతో రెండున్నర దశాబ్దాలు సంస్థతో పేరు వచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నెక్స్ జనరేషన్ భావాలతో కొత్త బ్రాండ్‌లు తీసుకొస్తామన్నారు. దక్షిణభారత్‌లోనే కాకుండా ఉత్తర భారత్‌లోనూ ఎస్‌పీఎల్ నెక్స్ విస్తృతం చేయదలిచామన్నారు. బెంగళూరు, చెన్నైతోపాటు కోల్కత్తాలోనూ ప్రాజెక్టులు కొనసాగించదలిచామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కృష్ణవీర రాఘవన్, టీవీ గణేశ్, కేఆర్ రమేశ్, వివేక్ వెంకటేశ్వర్, రవీంద్రకుమార్‌లు పాల్గొన్నారు.

ప్రాస్టేట్‌కోసం నీటి ఆవిరి థర్మో థెరపీ

బెంగళూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాస్టేట్ వ్యాధి సమస్యలకు చికిత్స చేసేందుకు దక్షిణభారత్‌లో తొలిసారిగా నీటి ఆవిరి థర్మోథెరపీని శేషాద్రిపురం అపోలో ఆసుపత్రిలో ఆరంభించారు. దేశంలో నీటి ఆవిరి లేదా ఆవిరి చికిత్స అనేది ప్రొస్టేట్‌కు చికిత్స చేయడానికి ఎఫ్‌డీఏచే ఆమోదించబడింది. ఇటీవల దేశవ్యాప్తంగా ప్రక్రియను కొనసాగిస్తున్నారు. 50ఏళ్ల పైబడిన పురుషుల్లో ప్రొస్టేట్ విస్తరణ లక్షణాలు పెరుగుతున్నాయి. మూత్రాశయం మధ్య ఉన్న నాన్‌ఎండోక్రైన్ గ్రంథిలో ఏర్పడే సమస్య ప్రొస్టేట్‌గా పరిగణిస్తారు. ఈ సమయంలో కొన్ని మూత్ర లక్షణాలలో వ్యత్యాసాలు వస్తాయి. ప్రొస్టేట్‌కు చికిత్సలు చేసేందుకు సాధారణ మందులనుంచి లేజర్ చికిత్స, ల్యాప్రొస్కోపిక్, రోబోటిక్స్ వంటి పద్ధతులు ఉన్నాయి. వాటర్ వేపర్ థర్మోథెరపీ సులభతరంగా నయం చేస్తున్నందున ప్రారంభించినట్లు యూరో అంకాలజీ రోబోటిక్స్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ టి మనోహర్ అభిప్రాయపడ్డారు.

25లోగా దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఆగస్టు 21: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని డీఈఓ వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్లలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి 2024 ఏడాదికి సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రెండు సెట్లు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా సంబంధిత ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ ఆఫీసుల్లో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు కనీసం 15 ఏళ్ల బోధనానుభవం ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు, ఆర్టికల్ ఆఫ్ చార్జస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండకూడదన్నారు.

ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 21: జెన్‌ప్యాక్ట్ (ఎంఎన్‌సీ) కంపెనీలో కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీసెస్, వాయిస్ సపోర్టు విభాగాల్లో 1500 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్‌ఖయ్యూమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, ఏదేని డిగ్రీ పూర్తిచేసి 2022, 2023, 2024 సంవత్సరాల్లో పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తులను హెచ్‌టీటీపీఎ్‌://బీఐటీ.ఎల్‌వై/46డబ్ల్యూజడ్‌క్యూజడ్6 లింక్ ద్వారా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ జరిగే తేదీ, స్థలం తదితర వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 9988853335ను సంప్రదించాలని కోరారు.